నల్లపోచమ్మ జాతరలో ఎమ్మెల్యే

నల్లపోచమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర, మే 30: మండలంలోని ముచ్చర్ల గ్రామంలో జరుగుతున్న నల్లపోచమ్మ జాతరలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అమ్మవారి చల్లని చూపులతో ప్రజలు సుఖిక్షణంగా ఉండాలని వేడుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. గురువారం ఆలయం వద్ద దేవుని కల్యాణం, ఒగ్గుకథ, అగ్నిగుండాలు, బోనాలు, గుమ్మటాలు, ఎడ్లబండ్ల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింహులు, ఎంపీటీసీ కిషన్‌రావు, నాయకులు యాదగిరి, శివశంకర్‌రావు, కిశోర్, వీరేందర్, కాషయ్య, శ్రీకాంత్, ఎల్చాల మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ నిస్వార్థంగా జీవించాలి

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్

స్పీకర్ గడ్డం ప్రసాద్

సదాశివపేట, మే 30: ప్రతి ఒక్కరూ సాటి మనిషిని ప్రేమించాలని, నిస్వార్థంగా జీవించాలని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. బుధవారం పట్టణంలోని సాయి బాబా మందిరం వద్ద గల అచలమాశ్రమంలో మదచల గురుపీఠ రాజయోగాశ్రమ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్ర అచల మహాసభలు నిర్వహించారు. ఈ సభలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు, అక్కా, చెల్లెల్లను ప్రేమించిన వారు ప్రపంచాన్ని ప్రేమిస్తారన్నారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను పట్టించుకోని వారు సమాజానికి ఏం సేవ చేస్తారని ప్రశ్నించారు. కులమతాలకు అతీతంగా సమసమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మదలచల గురుపీఠ రాజయోగాశ్రమ సేవా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పోరెడ్డి రమణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వటపత్రసాయి దయానంద్, చందంపేట బస్వరాజ్, సమరానంద తిరుపతయ్య, సేవా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో బీజేపీదే గెలుపు

సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్

కల్హేర్, మే 30: జహీరాబాద్ పార్లమెంట్ స్థానంలో బీజేపీ గెలుపొందడం ఖాయమని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని మహాదేవుపల్లిలోని వెంకటాద్రి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ వారీగా ఓట్ల సరళిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ ప్రభారీ పెద్దొల్ల గంగారెడ్డి, కన్వీనర్ రవికుమార్‌గౌడ్, కో కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు విజయపాల్‌రెడ్డి, యెండల లక్ష్మీనారాయణ, రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, అసెంబ్లీ కన్వీనర్ రజనీకాంత్, మండల అధ్యక్షుడు అనిల్‌రెడ్డి ఉన్నారు.

గ్రామ స్థాయిలోనే పరిష్కరించుకోవాలి

మనూరు, మే 30: గ్రామాల్లో తలెత్తిన సమస్యలు గ్రామ స్థాయిలోనే పరిష్కరించుకోవాలని మనూరు ఎస్సై అంబర్య నాయక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని బెల్లాపూర్ గ్రామంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. భూ సమస్యలకు గ్రామస్థాయిలోనే తొందరగా పరిష్కారం లభిస్తుందన్నారు. ఎండకాలం వచ్చిందంటే గ్రామాల్లో ఇలాంటి సమస్యలు ఎక్కువగా వస్తుంటాయని, గ్రామ స్థాయిలో అవగాహన లోపంతోనే ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏ ఎస్సై బోజ్యానాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

నిందితులపై కేసు నమోదు చేయాలి

కోహీర్, మే 30: బడంపేట గ్రామానికి చెందిన బేగరి నర్సింహులు మృతికి కారణమైన ప్రతి ఒక్కరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సమతా సైనిక్‌దళ్ నాయకులు కోరారు. గురువారం జహీరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావును కలిసి వినతిపత్రం అందజేసి వివరాలు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సింహులుపై తొమ్మిది మంది దాడి చేస్తే కేవలం ముగ్గురిని మాత్రమే అరెస్ట్ చేశారని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

బసవేశ్వరుడి మార్గం అనుసరణీయం

న్యాల్‌కల్, మే 30: మహాత్మా బసవేశ్వరుడు చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని కర్ణాటకలోని హిరేమఠ్ పీఠాధిపతి మహాలింగస్వామి అన్నారు. గురువారం మండలంలోని టేకూర్ గ్రామంలో లింగయాత్ సమాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బసవేశ్వరుడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమత వర్గ, లింగ విభేదం లేకుండా అందరూ సమానమేనని చాటి చెప్పిన మహనీయుడు బసవేశ్వరుడన్నారు. కార్యక్రమంలో కూడల సంఘం బసవధర్మం పీఠాధిపతి అనిమిషానంద స్వామి, బర్ధీపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి అవదూతగిరి మహారాజ్, ధనశ్రీ పీఠాధిపతి వీరేశ్వర శివాచార్యస్వామీజీ, రంజోల్ రాజయోగ పీఠాధిపతి రాచయ్యస్వామి, రాష్ట్రీయ బసవదళ్ లింగాయత్ సమాజ్ అధ్యక్షుడు శంకర్‌పాటిల్, రాయికోడ్ జడ్పీటీసీ మల్లికార్జున్‌పాటిల్, లింగాయత్ సమాజ్ నాయకులు మల్లికార్జున్ పాటిల్, వీరన్న, సంతోష్‌కుమార్, మల్లికార్జున్, సునీల్‌పాటిల్, రాజు, వైద్యనాథ్‌స్వామి పాల్గొన్నారు.

అశోక్ తండ్రి లక్ష్యయ్యను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

బాధితులకు పరామర్శ

నారాయణఖేడ్, మే 30: మున్సిపాలిటీ పరిధిలోని చాండ్‌ఖాన్‌పల్లిలో ఇటీవల హత్యకు గురైన అంకం అశోక్ కుటుంబాన్ని గురువారం మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పరామర్శించారు. భూవివాదం కారణంగా అశోక్ ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమన్నారు. నాయకులు విఠల్, అభిషేక్ శెట్కార్, ముజామిల్, లయక్ ఉన్నారు.

కల్హేర్‌లో..

కల్హేర్, మే 30: కల్హేర్ మండలం రాపర్తి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు లక్ష్యయ్య కొడుకు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి గురువారం గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు సాయిబాబాగౌడ్, కృష్ణమూర్తి, సాయిలు, గంగగౌడ్ ఉన్నారు.

రాష్ట్ర అవతరణ దినోత్సవానికి ఏర్పాట్లు చేయాలి

- జూన్ 3 నుంచి బడి బాట నిర్వహించాలి
- వచ్చే వానకాలాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ వల్లూరు క్రాంతి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, మే 30: రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను జిల్లాలో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 2న అవతరణ దినోత్సవ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. ప్రజా ప్రతినిధులు పాల్గొనే కార్యక్రమాల్లో ఎలాంటి రాజకీయ ప్రసంగాలు లేకుండా, ఉదయం 8.30 గంటల వరకు పతాకావిష్కరణ కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు. జిల్లా అధికారులు ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించే పతాకావిష్కరణలో పాల్గొనాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్వో పద్మజారాణి తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు ప్రజలను అప్రమత్తం చేయాలి

వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఇంజినీరింగ్, నీటి పారుదల శాఖ, అటవీ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, మున్సిపల్ పరిధిలో పాత ఇండ్లు, భవనాలను పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాత ఇండ్లలో ప్రజలు ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆయా శాఖల పరిధిలోని కల్వర్టులు, బ్రిడ్జిలు, రోడ్లను పరిశీలించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. హరితహారంలో భాగంగా ఎవెన్యూ ప్లాంటేషన్, ఓపెన్ ప్లాంటేషన్ చేపట్టాలన్నారు. మరో సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 3 నుంచి బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

సీఐటీయూ ఆవిర్భావ వేడుకలు

జిన్నారం: ఖాజీపల్లి టీఐడీసీ పరిశ్రమలో సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

జిన్నారం, మే 30: సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని పారిశ్రామిక వాడలో కార్మికులు ఘనంగా నిర్వహించారు. గడ్డపోతారం, ఖాజీపల్లి పారిశ్రామికవాడలోని టీఐడీసీ పరిశ్రమ ఆవరణలో సీఐటీయూ జెండా ఆవిష్కరించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో భాస్కర్‌రావు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాటం

సదాశివపేట, మే 30: కార్మికుల హక్కుల కోసం సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం సీఐటీయూ 54 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నందికంది బ్లూ క్రాఫ్ట్ పరిశ్రమ వద్ద జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు జి.శ్రీనివాస్, వి.శ్రీనివాస్, జనార్దన్, వీరేశం, సాయిలు, జోసఫ్, మైబుఅలీ, విజయ్, చందర్, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, వినయ్‌సాగర్, చంద్రశేఖర్, పాండు పాల్గొన్నారు.

సీఐటీయూ జెండా ఆవిష్కరణ

కోహీర్, మే 30: జహీరాబాద్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంతోపాటు మహీంద్రా ట్రాక్టర్ పరిశ్రమ ఆవరణలో గురువారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. సీఐటీయూ ఎల్లప్పుడూ కార్మికులు, రైతులు, ప్రజల పక్షాన ఉంటుందన్నారు. వారి హక్కుల కోసం పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం నిరంతరం పోరాటం

సంగారెడ్డి, మే 30: కార్మికుల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాటం చేయాలని, కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. గురువారం పట్టణంలోని కేవల్ కిషన్ బవన్‌లో సీఐటీయూ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చుక్క రాములు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బాగారెడ్డి, ప్రవీణ్, జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి, విద్యాసాగర్, సురేశ్, నాయకులు శోభ, లక్ష్మణ్, నర్సింలు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూతోనే సమస్యలు పరిష్కారం

గుమ్మడిదల, మే 30: కార్మికుల సమస్యలు సీఐటీయూతోనే పరిష్కారమవుతాయని ఆ సంఘం ఉపాధ్యక్షుడు శ్రీధర్‌రావు, కార్యదర్శి నర్సింహాగౌడ్ అన్నారు. గురువారం మండలంలోని దోమడుగు, బొంతపల్లి పారిశ్రామిక వాడలోని న్యూలాండ్ పరిశ్రమ వద్ద సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం బాధ్యులు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారంలో సీఐటీయూ ముందువరుసలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ సెక్రోటరీ ఎస్.దేవేందర్, కమిటీ సభ్యులు హుస్సేన్, వీరేశం, గోపాల్, కార్మికులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

రమేశ్‌గౌడ్

అమీన్‌పూర్, మే 30: భార్యతో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయిన భర్త అదృశ్యమైన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లింగమయ్య కాలనీలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ లింగమయ్య కాలనీలో నివసించే రమేశ్‌గౌడ్(41) పక్షవాతంతో ఇంటివద్దే ఉంటున్నాడు. 28వ తేదీ సాయంత్రం ఆర్‌సీపురంలో ఉన్న తన అన్న ఇంటికి వెళ్లి తిరిగి 29న రాత్రి 9.30 గంటలకు ఇంటికి వచ్చాడు. తర్వాత భార్య అనుపమ అన్న దగ్గరికి వెళ్లడంపై భర్తతో గొడవ పెట్టుకుంది. దీంతో భర్త రమేశ్‌గౌడ్ ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. అతని ఫోన్‌కు స్విచ్ ఆఫ్ రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్సై మల్లయ్య మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి

గుమ్మడిదల, మే 30: విద్యుత్‌ఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన ఘటన అన్నారం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన కైలాసధరుహా(34) , సాయి భానికుమార దంపతులు. బతుకుదెరువు కోసం మండలంలోని అన్నారం గ్రామంలో పని చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. 29వ తేదీన బుధవారం వారుండే గుడిసెకు కరెంట్ బల్బు బిగించడానికి కైలాసధరుహా ప్రయత్నిస్తుండగా విద్యుత్ షాక్ తగిలి కుప్పకూలాడు. వెంటనే సురారంలోని మల్లారెడ్డి దవాఖానకు తరలించారు. అప్పటికే అతడి మృతి చెండాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

జొన్నల కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి

రాయికోడ్, మే 30: జొన్నల కొనుగోళ్లను వేగంగా పూర్తి చేయాలని జహీరాబాద్ ఆర్డీవో రాజు ఆదేశించారు. గురువారం రాయికోడ్ జొన్నల కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. తమ జొన్నలు తీసుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేయగా విషయం తెలుసుకున్న మండల వ్యవసాయాధికారి అవినాష్ వర్మ డీసీఎంఎస్ సిబ్బందితో మాట్లాడి సమస్యపై రిష్కరించారు. ఉప తహసీల్దార్ విజయకుమార్, ఏవో అబినాష్‌వర్మ, ఏఈవోలు యాదగిరి, శివశంకర్, డీసీఎంఎస్ సిబ్బంది యాదగిరి, ఎంపీటీసీ పండరి ఉన్నారు.

బామనకుంటలో మట్టి తవ్వకాలపై ఫిర్యాదు

బామనకుంటలో ఏర్పడిన భారీ గుంత

జిన్నారం, మే 30: గడ్డపోతారం పంచాయతీ ఆల్విన్‌నగర్ బామనకుంటలో మట్టి తవ్వకాలపై గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా తవ్వకాలు ఆగడం లేదు. రెండు రోజులుగా రాత్రిపూట కుంట శిఖంలో మట్టి తవ్వకాలు జరిపి నిర్మాణంలో ఉన్న పరిశ్రమలకు తరలించారు. మట్టి తవ్వకాలతో ప్రమాదకరమైన భారీ గుంతలు ఏర్పడ్డాయి. బుధవారం గ్రామస్తులు మట్టి తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని, పరిశ్రమలో పోసిన మట్టిని ఫొటోలు, వీడియోలు తీసి కలెక్టర్‌కు పంపించారు. కుంట శిఖంలో తవ్వకాలు జరుపుతున్నారని, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాట్సాప్ ద్వారా కలెక్టర్‌కు పంపించినట్లు గ్రామస్తులు తెలిపారు.

శిఖం కబ్జాను అడ్డుకోవాలి

కోహీర్, మే 30: మండలంలోని చింతల్‌ఘాట్ గుండం చెరువు శిఖాన్ని ఓ పరిశ్రమ యజమాన్యంతోపాటు మరి కొంతమంది కలిసి కబ్జా చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. గతంలో మిషన్ కాకతీయ ద్వారా చెరువును అభివృద్ధి చేశారని, వారు మాత్రం చెరువు తూము వరకు ఇనుప కంచె ఏర్పాటు చేసేందుకు కడీలను పాతుతున్నారని మండిపడ్డారు. దీనిపై తహసీల్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తామన్నారు. చెరువు శిఖం కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని, త్వరలో వినతిపత్రం అందజేస్తామన్నారు.

అధునాతన హంగులతో సైబర్ ల్యాబ్

ఎస్పీ చెన్నూరి రూపేశ్

సైబర్‌ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ చెన్నూరి రూపేశ్

సంగారెడ్డి, మే 30: అధునాతన హంగులతో కార్పొరేట్ స్థాయిలో నూతన సైబర్ ల్యాబ్ (జిల్లా సైబర్ క్రైమ్ కోఆర్డినేటర్ సెంటర్) నిర్మించామని ఎస్పీ చెన్నూరి రూపేశ్ తెలిపారు. గురువారం నూతనంగా నిర్మించిన సైబర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఐటీ, సైబర్ సెల్‌ను కలుపుతూ అన్ని విభాగాలు ఒకే దగ్గర ఉండేలా అన్ని సదుపాయాలతో కార్యాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. సైబర్ ల్యాబ్‌లో శిక్షణ పొందిన సిబ్బంది ఉంటారన్నారు. జిల్లాలోని వివిధ పోలీస్టేషన్లలో తలెత్తిన సమస్యలను నివృతి చేయడంతోపాటు టెక్నికల్ సపోర్టు అందుతుందన్నారు. సిబ్బంది సమన్వయంతో పని చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవరావ్, అడ్మినిస్ట్రేషన్ అధికారి కళ్యాణి, డీఎస్పీలు సత్యయ్యగౌడ్, రవీందర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తు

సంగారెడ్డి, మే 30: ఎంపీ ఎన్నికలకు సంబంధించి జూన్ 4వ తేదీన గీతం యూనివర్సిటీలో జరిగే కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ చెన్నూరి రూపేశ్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కౌంటింగ్‌కు వచ్చే వివిధ రాజకీయల నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక పార్కింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని, ఎంట్రీ పాసులు లేనిది ఎవ్వరినీ అనుమతించవద్దన్నారు. కౌంటింగ్ హాల్ లోపల ప్రతి ఒక్కరినీ క్షుణంగా తనిఖీ చేయాలని, నిషేధిత వస్తువులను అనుమతించవద్దన్నారు. కౌంటింగ్ ప్రారంభమైన తర్వాత ప్రతి రౌండ్ మీడియా పాయింట్ వద్ద వెల్లడిస్తారని, ఎవరూ అధైర్యపడాల్సిన అవసరంలేదన్నారు. కౌంటింగ్ అనంతరం జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో నకిలీ విత్తనాల సరఫరా నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మినట్లు తేలితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. నకిలీ విత్తనాలను గుర్తించడానికి గ్రామాల వారీగా అగ్రికల్చర్ అధికారులతో కలిసి పని చేయాలని ఎస్‌హెచ్‌వోలకు సూచించారు. జూన్ 9న జరిగే గ్రూప్-1 పరీక్షకు వచ్చే అభ్యర్థులకు ఎలాం టి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.సంజీవరావు, డీఎస్పీలు సత్యయ్యగౌడ్, రవీందర్‌రెడ్డి, రాంమోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతలో రాజీలేదు

ఆటోలకు స్టికర్లు వేసి ప్రారంభిస్తున్న అదనపు ఎస్పీ సంజీవరావు, డీఎస్పీ రవీందర్‌రెడ్డి

పటాన్‌చెరు, మే 30: మహిళల భద్రతలో రాజీపడమని అదనపు ఎస్పీ సంజీవరావు అన్నారు. గురువారం పటాన్‌చెరులో 'మై ఆటో ఇజ్ సేఫ్' అనే కార్యక్రమానికి డీఎస్పీ రవీందర్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఆటోలకు క్యూఆర్ కోడ్‌లు అతికించి జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు మహిళలు, వృద్ధులు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు. ప్రతి ప్రయాణికుడిని గౌరవించాల్సిన బాధ్యత ఆటో డ్రైవర్లపై ఉన్నదన్నారు. ప్రతి ఆటోకు ముందు భాగంలో, డ్రైవర్ సీటు వెనుక క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులు ఆటో డ్రైవర్‌పై అనుమానం ఉన్నా, ఏదైనా ప్రమాదంలో ఇరుక్కున్నా సెల్‌ఫోన్ ద్వారా స్కాన్ చేసి మెసేజ్ చేస్తే కంట్రోల్‌రూమ్‌కి ఫిర్యాదు చేరుతుందన్నారు. పోలీసులు ట్రేస్ చేసి ఆ ఆటోను పట్టుకుంటారన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ శ్రీధర్‌రావు, సీఐలు గంగాధర్, రవీందర్‌రెడ్డి, శ్రీధర్, ఆటో యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

ఎల్‌వోసీని అందజేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, మే 30: భారతీనగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీకి చెందిన తనూజకు రూ.లక్ష ఎల్‌వోసీని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అందజేశారు. గురువారం పటాన్‌చెరు పట్టణంలో ఎమ్మెల్యే తనూజ కుటుంబ సభ్యులకు రూ.లక్ష సీఎం సహాయ నిధి నుంచి వచ్చిన ఎల్‌వోసీని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన వైద్యం కోసం సీఎం రిలీఫ్‌ఫండ్స్‌ను త్వరతిగతిన తెప్పించి ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సప్తాహం

మనూరు, మే 30: వీరభద్రేశ్వర ఆలయంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న సప్తాహం గురువారంతో ముగిసింది. మండల పరిధిలోని మాయికోడ్‌లోని వీరభద్రేశ్వర ఆలయంలో ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా గ్రామస్తులు సప్తాహ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రోజూ ఆలయంలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించి ఒక్కో గ్రామ భజన కళాకారుల చేత భజన కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ముగింపు కావడంతో గ్రామంలో పల్లకీ సేవ, కళశ ఊరేగింపు నిర్వహించి అన్నదానం చేశారు. ఈ సదర్భంగా గ్రామంలో ఆధ్యాత్మి శోభ సంతరించుకుంది. కార్యక్రమంలో మహిళలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విత్తన కొనుగోళ్లపై జాగ్రత్త

గుమ్మడిదలలో ఎరువుల, విత్తనాల షాపును తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు

గుమ్మడిదల, మే 30: వానకాలంలో సాగు కోసం విత్తనాలు కొనే సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రతలపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. మండలంలోని అనంతారం గ్రామంలో గురువారం మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు, ఏఈవోలు అస్మిత, నిఖిత మాట్లాడారు. మండలంలో 2,250 ప్యాకెట్ల పత్తి విత్తనాలు, 270 క్వింటళ్ల వరి విత్తనాలు, వంద క్వింటళ్ల మక్కజొన్న విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని ఆదేశించారు. తప్పని సరిగా రసీదు ఇవ్వాలని సూచించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

నాగల్‌గిద్ద, మే 30: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏడీఏ నూతన్‌కుమార్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. అనంతరం రైతు వేదికల్లో డిలర్లతో సమావేశమయ్యారు. విత్తనాలు కొన్న రైతులకు రసీదును తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. స్టాక్ బోర్డు, స్టాక్ రిజిష్టర్లను సరిగా నిర్వహించాలన్నారు. ఏవో వెంకటేశం ఉన్నారు.

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు అవసరం

అందోల్, మే 30: విత్తనాల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి విజయరత్న సూచించారు. గురువారం జోగిపేట, సాయిబాన్‌పేట గ్రామాల్లో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి విత్తనాల కొనుగోళ్లపై అవగాహన కల్పించారు.